నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట




# క్రిస్మస్

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా వేడుకలు
- ఆనందోత్సాహాలతో జరుపుకొన్న క్రైస్తవులు
- ప్రార్థనలతో మార్మోగిన చర్చీలు
- ఊరూవాడా కేక్ కటింగ్‌లు.. పాస్టర్ల శాంతి ప్రబోధనలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



మహబూబ్‌నగర్‌లోని ఎంబీ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

క్రిస్మస్ సంబురాలు ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రార్థనలు, గీతాలాపనలు చేశారు. కేకులు కట్‌చేసి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవుల రాకతో చర్చీలన్నీ కిటకిటలాడాయి. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శాంతి సందేశాన్ని ప్రబోధించారు. పలు చోట్ల లోకరక్షకుడి జన్మవృత్తాంతాన్ని తెలిపే నాటికలు, నృత్యాల ప్రదర్శన అలరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాలయేసు సెట్టింగులు ఆకట్టుకున్నాయి.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 25



వనపర్తిలో చర్చి ఎదుట పండుగ సంబురంలో యువతులు




# హామీ నీటి మూటేనా?

మాటలు కోటలు దాటుతాయి.. కానీ చేతలు మాత్రం గడప దాటవు.. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు చూస్తే ఈ నానుడే గుర్తొస్తుంది. ప్రభుత్వ వర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చింది. ఆ తర్వాత చెప్పిన మాటకు చేతలకూ ఎక్కడా పొంతన కనిపించడం లేదు. దీంతో ఒప్పంద అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు.

– మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 25

- ఏడాది దాటినా.. తీరని సమస్య
- అమలుకు నోచుకోని కాంగ్రెస్ మేనిఫెస్టో
- దగాపడిన యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు
- ఆందోళనకు కార్యాచరణ ప్రణాళిక
- స్పందించకుంటే పరిణామాలు తీవ్రతరమని హెచ్చరిక

### దగాపడ్డ 'వర్సిటీ ఒప్పంద అధ్యాపకులు'

ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఒప్పంద అధ్యాపకులు దగాపడ్డారు. ఉన్నత విద్య, విద్యార్థి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తూ వారు మాత్రం చీకట్లో మగ్గుతున్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని పేర్కొంది. కానీ ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో దిక్కుతోచని దుస్థితిలో ఒప్పంద అధ్యాపకులు కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 1,445 మంది ఒప్పంద అధ్యాపకులు విధులు నిర్వర్తిస్తున్నారు. చాలా వరకు వర్సిటీల్లో చేతులమీద లెక్కించే స్థాయిలో ప్రభుత్వ ఆచార్యులను మినహాయిస్తే మిగతా బోధన సిబ్బంది అంతా ఒప్పంద ఉద్యోగులే. రేవంత్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది దాటినా.. శాశ్వత ఉద్యోగులుగా గుర్తింపు ప్రక్రియలో మాత్రం పురోగతి లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఆందోళనకు సిద్ధం

క్రమబద్ధీకరణ చేయాలంటూ ఒప్పంద అధ్యాపకులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు.. ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోలో తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామంటూ ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 13న ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసేందుకు సుమారు 300 మందికిపైగా అధ్యాపకులు తరలి వెళ్లారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వారితో చర్చలు జరిపి త్వరలో ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హామీలన్నీ నీటి మూటలుగానే మారుతుండటం, ప్రజా పాలన ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కాలం పూర్తయి విజయోత్సవాలు జరుపుకొన్నా.. తమను పట్టించుకోవడం లేదంటూ కాంట్రాక్టు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### వర్సిటీల్లో బోధనకు తిప్పలు

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 60 శాతానికిపైగా పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఒప్పంద, అతిథి అధ్యాపకులే దిక్కయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 3,259 వర్సిటీ అధ్యాపక పోస్టులు ఉండగా.. వాటిలో 60 శాతానికిపైగా ఖాళీగా ఉన్నాయి. పీయూలో 95 మందికి కేవలం 20 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రొఫెసర్లు ఉద్యోగ విరమణ చేస్తున్నా.. కొత్త నియామకాలు చేపట్టడం లేదు. ఒప్పంద అధ్యాపకులతోనే నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 105 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

### యూజీసీ నిబంధనలు ఎక్కడ?

విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) నిబంధనల ప్రకారం ఒక్కో విభాగానికి కనీసం ఒక అచార్యుడు, ఇద్దరు అసోసియేట్ ఆచార్యులు, నలుగురు సహాయ ఆచార్యులు ఉండాలి. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లోనూ ఈ స్థాయిలో అధ్యాపకులు లేరు. 20 మంది విద్యార్థులకు అధ్యాపకుడు ఉండాలి. పాఠాలు బోధించేందుకు రెగ్యూలర్ అధ్యాపకులు ఉండాలనే నిబంధన అమలు కావడం లేదు. న్యాక్ గుర్తింపు లభించాలంటే మొత్తం పోస్టుల్లో 75 శాతం భర్తీ అయి ఉండాలి. దీని ఆధారంగా కేంద్ర సంస్థలు నిధులిస్తాయి. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించాల్సి ఉన్నది.

### అరకొర వేతనాలతో అవస్థలు



వర్సిటీల ప్రారంభం నుంచి అరకొర జీతాలతో పనిచేస్తున్నాం.. బోధనతో పాటు ఎన్నో అదనపు డ్యూటీలు చేస్తున్నాం. అనేక పర్యాయాలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్ట సభల్లో ప్రస్తావించినా.. మేధావులు, విద్యావేత్తలు వివిధ వేదికలపై చెబుతున్నా.. మా సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి పరిష్కారానికి కృషి చేయాలి.

**- ఏ.సుదర్శన్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్, పీయూ**

### ఉద్యోగ భద్రత కరువు



విశ్వవిద్యాలయాలు భావిభారత పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్దే కేంద్రాలు. సమాజంలోని అభివృద్ధికర మార్పులకు పురుడు పోసే ప్రదేశాలు. వీటిలో ఎంతో విశిష్టమైన గురుతర బాధ్యతను నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు ఏండ్ల తరబడి సేవలందిస్తూ భద్రత లేని ఉద్యోగం, చాలీచాలని జీతం. ప్రభుత్వం ఆలోచించి రెగ్యులరైజ్ చేయాలి.

**- డాక్టర్ ఎన్.వేణు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జువాలజీ డిపార్ట్‌మెంట్, పీయూ**

### 7వ పీఆర్సీ అమలు చేయాలి



ఉద్యోగ భద్రతతో కూడిన 7వ పీఆర్‌సీ అమలు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి. మా సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందంటున్నా.. పట్టించుకోకపోవడం దారుణం. మాపై కనికరం చూపి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు అందరినీ రెగ్యులరైజ్ చేయాలి.

**- మాధురి మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్, పీయూ**

### సత్వర పరిష్కారం చూపాలి



గతంలో ఒప్పంద అధ్యాపకులను త్రిసభ్య కమిటీ ద్వారా నియమించారు. నెట్, సెట్, పీహెచ్‌డీ, పీడీఎఫ్ అర్హతలు ఉన్నప్పటికీ చాలీచాలని జీతంతో 20 ఏండ్లుగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు వెంటనే 7వ పీఆర్‌సీ అమలు చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలి. తమ సమస్యలకు పాలకులు సరైన పరిష్కారాలు చూపాలి. దస్త్రం ముందుకు కదలకపోవడంతో కాంట్రాక్టు అధ్యాపకులకు తీవ్ర నష్టం జరుగుతోంది.

**- డాక్టర్ రవికుమార్, పీయూ ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు**

# రోడ్లు ఊడ్చి.. కల్లాపి చల్లి.. ముగ్గులు పెట్టి..

- పాలమూరులో ఎస్ఎస్ఏ ఉద్యోగినుల వినూత్న నిరసన



సమ్మె శిబిరం వద్ద రోడ్డుపై ముగ్గులు వేసి ఎస్ఎస్ఏ ఉద్యోగినుల నిరసన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 25 : సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనలో భాగంగా చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు సీఎం సారూ.. ఇచ్చిన హామీ నిలబెట్టుకోరూ..? అంటూ వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం టీటీడీ కల్యాణ మండపం ఎదుట ఉన్న ధర్నా చౌక్‌లో రోడ్లు ఊడ్చి.. కల్లాపి చల్లి.. ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పదహారు రోజులుగా సమ్మె చేస్తున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని వాపోయారు. మీరు ఇచ్చిన మాట నిలుపుకోవాలంటూ.. మేము డిమాండ్ చేయాలా.? అంటూ విమర్శించారు. ఇది నిరుపేద విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే అవుతుందన్నారు. ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా మా బాధను అర్థం చేసుకుని వెంటనే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. పరీక్షలు దగ్గర పడుతున్న వేళ బోధించేవారు లేక విద్యార్థులు కన్నీరు పెడుతున్నారని ఏఎంవో శ్రీనివాస్ వాపోయారు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమాల్లో జిల్లా జే ఏసీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజామైనొద్దీన్, కోశాధికారి విక్రమ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సుమంత్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, భాస్కర్, కలీం, మాధవి, శంకరమ్మ, హరిత, నాగలక్ష్మి, గీత, అమృత, సుజాత, సత్యం, శంకర్, గంగమ్మ, నారాయణ, చెన్నమ్మ, అన్వర్, జగదీశ్, అర్చన పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యం.. మహిళ మృతి



దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబర్ 25 : వైద్యం చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలకపల్లి మండలంలోని ఆలేరుకు చెందిన రాములమ్మ (25)కు నాలుగు నెలల కిందట ప్రసవం జరిగి పుట్టిన బిడ్డ మృతి చెందాడు. ప్రస్తుతం రాములమ్మకు కడుపునొప్పి రావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర దవాఖానకు తీసుకొచ్చారు. రెండు గంటల పాటు వైద్యులు చికిత్సలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆమె మృతి చెందింది. అయితే వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని దవాఖాన ఎదుట కుటుంబీకులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. కాగా దవాఖాన నిర్వాహకులను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

# చైన్‌స్నాచింగ్‌కు యత్నం

- పెబ్బేరులో ప్రతిఘటించిన మహిళ

పెబ్బేరు, డిసెంబర్ 25 : మహిళ మెడలో బంగారం చోరీకి పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు యత్నించిన సంఘటన వనపర్తి జిల్లాలో చోటు చేసుకున్నది. బాధితురాలి కథనం మేరకు..

పెబ్బేరు పట్టణంలోని బీసీ కాలనీ రోడ్డులోని చిన్న పెంటమ్మ అనే మహిళ పండ్లు అమ్ముకొని జీవనం సాగిస్తుంది. బుధవారం ఉదయం తన పండ్ల బండిని సిద్ధం చేసుకుంటున్న తరుణంలో మంకీ క్యాపులు ధరించి మోటర్ సైకిల్‌పై వచ్చిన దుండగులు ఆమె మెడలోని గొలుసును లాక్కునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆమె గట్టిగా కేకలు వేసి పెనుగలాడటంతో దొంగలు ఆమెను వదిలి పరారయ్యారు. ధైర్యంగా దొంగలను ప్రతిఘటించిన ఆ మహిళను స్థానికులు అభినందించారు.




దొంగలను ఎదుర్కొన్న పెంటమ్మ

# నాణ్యతకు తిలోదకాలు

- నాసిరకంగా కేజీబీవీ కళాశాల భవన పనులు

చారకొండ, డిసెంబర్ 25 : ఎద్దైనా నిర్మాణం చేపడితే పునాది గట్టిగా ఉండాలని చూస్తాం. కానీ మండల కేంద్రంలో కేజీబీవీ కళాశాల భవన నిర్మాణ పనులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా చేపడుతున్నారు. ప్రభుత్వం రూ.3.25 కోట్ల నిధులు నూతన భవనానికి మంజూరు చేసింది. దీంతో గతనెల 25న ఎమ్మెల్యే వంశీకృష్ణ పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రానికి 2 కి.మీ. దూరంలో ఈ భవనాన్ని నాసిరకంగా నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. 44 పిల్లర్లతో పనులు చేపట్టగా సగం వరకు మాత్రం బండరాయిని తొలగించకుండానే వేశారు. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులను పర్యవేక్షించి నాణ్యతగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఏఈ కోటేశ్వర్‌రావును వివరణ కోరగా.. నిర్మాణంలో కొన్ని చోట్ల బండరాయి ఉన్నది వాస్తవమే..మంచిగా ఉన్న చోట గుంతలు తీసి పిల్లర్లు చేశారన్నారు. మిగితా చోట బండరాయి ఉందని తెలియడంతో పనులు ఆపాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు చెప్పారు. పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.





# నల్లమలను కమ్మేసిన మంచు దుప్పటి

దోమలపెంట, డిసెంబర్ 25 : పొగమంచు వేకువజామున.. ఉదయం వేళల్లో కమ్మేయడం చూ స్తుంటాం.. కానీ నల్లమలలో మిట్టమధ్యాహ్నమే కమ్ముకున్నది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంట, శ్రీశైలం పరిసర ప్రాంతాలను స్నో కమ్ముకుంది. దీంతో శ్రీశైలం–హైదరాబాద్–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, ఘాట్‌రోడ్డుపై మలుపులు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనాలు ఢీకొని స్వల్పంగా దెబ్బతిన్నాయి. దట్టంగా మంచు కమ్మేయడంతో వెహికిల్స్ లైట్లు వేసుకొని రాకపోకలు సాగించాయి. కాగా మంచుకురిసే వేళను పలువురు సందర్శకులు ఆస్వాదిస్తూ.. ప్రయాణం సాగించారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న గుంటూరు– విజయవాడ జట్లు

# హోరాహోరీగా..

- అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలు
- పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన 20 జట్లు

మల్దకల్, డిసెంబర్ 25 : మండలంలోని దాసరిపల్లి గ్రామంలో గ్రామ దేవత సవారమ్మ అవ్వ ఆశీస్సులతో గ్రామ కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు. బుధవారం పోటీలను ఎస్సై నందికర్, మాజీ సర్పంచ్ భరత్ కుమార్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో హైదరాబాద్‌తోపాటు బెంగళూర్, ప్రకాశం, గుంటూరు, ఎల్లంక, నెల్లూరు, విజయవాడ, వివిధ రాష్ట్రాలకు చెందిన 20 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, క్రీడాకారులు తరలివచ్చి తిలకించారు. హో రాహోరీగా సాగుతున్న మ్యాచ్‌లను చూసి ఈలలు, చప్పట్లతో క్రీడాకారులను ఉత్సాహపర్చుతున్నారు.

### 27న పిల్లలమర్రి బాలోత్సవం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, డిసెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో ఈనెల 27, 28వ తేదీన పిల్లలమర్రి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు పిల్లల మర్రి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు బెక్కం జనార్దన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల అధ్యాపకులు తమ విద్యార్థుల పేర్లు ను గురువారంనుంచి నమోదు చేసుకోవాని కోరారు.

# వేతన వెతలు!

- ఉమ్మడి జిల్లాలో సంచార పశువైద్య సిబ్బందికి 10 నెలలుగా జీతాల్లేవ్
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సిబ్బంది

మహబూబ్‌నగర్, డిసెంబర్ 25 : సంచార పశువైద్య సిబ్బంది ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మూగజీవాలకు ఏ చిన్న ఆపద వచ్చినా ఒక్క ఫోన్ కాల్‌తో క్షేత్రస్థాయికి చేరుకొని చికిత్సలు అందిస్తున్న 1962 సిబ్బంది వేతనాల కోసం వెతలు పడుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా జీతాలు రాకపోవడంతో ఆవేదన పడుతున్నారు. ఈఎంఆర్ సంస్థ జీతాలను చెల్లించడం లేదని వాపోయారు. 2017లో కేసీఆర్ ప్రభుత్వం 1962 పశుసంచార వాహన సేవలకు శ్రీకారం చుట్టింది. దీంతో రాష్ట్రంలోని వంద వాహనాలు క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్య సేవలు అందిస్తూ పాడి రైతుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.

### ఉమ్మడి జిల్లాలో 10 సంచార వాహనాలు

సంచార పశువైద్య వాహనాలలో పశువైద్యాధికారి, పారావెట్ పైలట్, హెల్పర్లను ఏర్పాటు చేయగా.. ఈఎంఆర్ అనే సంస్థ నిర్వహణ బాధ్యతలు చూస్తోంది. అయితే జీతాల విషయానికొస్తే సకాలంలో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతేనే వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నది. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్‌లో 3, నారాయణపేటలో 2, నాగర్‌కర్నూల్‌లో 4, వనపర్తిలో ఒకటి, గద్వాల జిల్లాలో 2 సంచార వాహనాలు.. 48 మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. కొన్ని నెలలుగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఉద్యోగుల కుటుంబ పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈఎంఆర్ సంస్థ సిబ్బందికి నిధులు సర్దుబాటు చేసినా ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో 10 నెలలుగా జీతాలకు నోచుకోలేదు. దీనికి తోడు 1962 వాహనాల్లో మందుల కొరత ఏర్పడింది. ఇలా అయితే క్షేత్రస్థాయిలో మూగజీవాలకు వైద్యం అందించలేని పరిస్థితి తలెత్తిందని పలువురు రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలని సంచార పశువైద్య సిబ్బంది కోరుతున్నారు.

